# ఉలిపికట్టె

హఠాత్తుగా శంకరం పోయాడు.

మాధురి గుండె ఆగిపోలేదు.

మతిస్థిరం తప్పలేదు.

కనీసం గొంతెత్తి ఏడవనైనా లేదు.

కూతురుని పట్టుకుని శాంతమ్మ గొల్లుమని ఏడ్చింది. ఇరువైపుల బంధువులూ విచారపడిపోయారు. 'ఇంత చిన్నవయసుకే ఇంతకష్టమా' అన్నారు. కాని చిత్రం....మాధురి ఏడవలేదు.

చుట్టాలు ఎవరిని అనునయిస్తారు?

తల్లి ఎవరికి ధైర్యం చెబుతుంది?

అంత సానుభూతీ ఎవరికి చెందేటట్లు?

శవం సాగిపోతుంటే రెండేరెండు కన్నీటి బొట్లు మాధురి చెక్కిళ్ళ మీద జారాయి.

అందరూ భయపడుతూనే వున్నారు....మాధురి ఏదో అఘాయిత్యం చేస్తుందని, వున్నట్లుండి ఏదోవిపరీతం జరుగుతుందని....కానీ మాధురి ఏ అఘాయిత్యమూ చెయ్యలేదు....ఆ ఇంట్లో ఏ విపరీతమూ జరగలేదు.

పదకొండు రోజులు ముగిశాయి. మాధురికి విధవ ముద్రపడింది. తన తల్లి గుండె చెరువయ్యేలా ఏడ్చింది. మాధురి మాత్రం అతి మౌనంగా తతంగాలన్నీ ముగించుకుంది.

విడ్డూరం అనుకున్నారు అందరూ, అవును మరి భర్తపోతే స్త్రీకి జీవితంలో ఏం మిగులుతుంది? మాధురికి పెళ్ళయి రెండేళ్లయినా పూర్తికాలేదు. ఇంతలో ఈ అన్యాయం జరిగి పోయింది. ఇంతకూ మాధురి ఏడవలేదెందుకని? ఏమో కాలం మరీపాడయిపోతుంది. అయినా ఇదేం ఆడది తల్లీ? దానిది హృదయమా, శిలాఫలకమా? అది మనిషా, రాక్షసా?

ఈ అభిప్రాయాలు మాధురి వినిపించుకోలేదు కాని ఊహించుకుంది.

కన్నతల్లికి కూడా కూతురి తత్వము బోధ పడలేదు. ఆ చీకటి రాత్రి మాధురి కూడా తనను తాను ప్రశ్నించుకొంటూ జ్ఞాపకాల పుటలు తిరుగ వేసింది.

* * *

వివాహం ఒక వ్యవస్థ, దానికి తాను కట్టుపడింది. ప్రేమించి భంగపడిందీ లేదు, తియ్యటి జీవితం ఊహించుకోనూ లేదు. జీవితం యధాతధంగా తీసుకుంది తాను.

కాని ...,ఆయన........ కేవలం యంత్రమని కొన్నిరోజుల్లోనే తెలిసిపోయింది. ఏపనిలోనూ అతనికి అనుభూతివున్నట్లు కనిపించ లేదు. తన అవసరం కనిపించిన క్షణాల్లో 'ఏయ్ ఇటురా' అని ఆజ్ఞా పించేవాడు. మాటాపలుకూ లేకుండా తనకోర్కెలు తీర్చుకునేవాడు. ఆ క్షణాల్లో బాగా మదించి బుసలుకొట్టున్న ఎద్దుగుర్తు కొచ్చేది మాధురికి.

లోకానికి తను గొప్పఉద్యోగస్థుని భార్య. సంస్కారంగల వ్యక్తి తన భర్తకాని, కాని వీధిలోకి వస్తేవెయ్యి అనుమానాలతో తనను చూస్తూంటాడు. తనమాట, పలుకు, చూపులు అన్నీ విమర్శిస్తాడు. నవ్వితే .... 'ఏమిటా వెకిలినవ్వు?' ఊరుకుంటే... 'ఎప్పుడూ ఏడుపు మొహమే.' అలంకరించుకొంటే.... 'ఏమిటా షోకులు?' సాదాగావుంటే 'ఏం నీమొగుడు నీ అవసరాలు తీర్చటం లేదా?'

తను సాధ్యమయినంతవరకు ఓర్చుకుంది. తన మౌనంకూడా ఆయనను రెచ్చగొట్టేది.

ఒక సాయంకాలం వచ్చీరాగానే—

'ఎవడికోసం ఎదురుచూస్తున్నావు?' అన్నాడు కఠినంగా.

తెల్లబోయింది.

'ఆ దొంగచూపులూ, నీవూ—సమాధానం చెప్పవేం,'

'వీధిలో ఏదో అమ్మకానికివస్తే—'

'చాల్లే—' అన్నీ భోగంవేషాలు'

తన గుండెను పిండినట్లయింది, 'ఛీ—ఏం మనిషి మీరు?' తన దవడలు వాచిపోయాయి. తలను గోడకేసి బాదాడు. 'నన్ను ఛీకొట్టే స్థాయికి చేరుకున్నావన్న మాట'

'ఇంత పశువనుకోలేదు' అంది ఉద్రేకాన్ని అదుపులో పెట్టలేని తను.

ఫలితంగా రెండురోజులు అడుగుతీసి పెట్టలేక పోయింది. అప్పుడే అతనిని హృదయ పూర్వకంగా అసహ్యించుకొంది, సాటి మనిషిని ఏ కారణం లేకుండా బానిసలా చూసుకునేవాళ్లను చిత్రహింస పెట్టి ఆనందము పొందేవాళ్ళను భరించటమెంత కష్టమో, తనకు తెలిసి వచ్చింది.

ఒక మధ్యాహ్నం నిద్రబోతున్న తన జుట్టు గుంజినట్లయి ఉలికి పడి లేచింది.

'ఎవడు వీడు?'

తనకు అర్థం కాలేదు.

అతని చేతిలో కాలేజి కల్చరల్ అసోషియేషన్ ఫోటో—

'ఏమిటలా చూస్తావు? ఒయ్యారంగా వాడి మీద ఒరిగి కూర్చున్నావు. ఎవడు వీడు?'

'నా ప్రియుడు—ఆ మాత్రం తెలీదూ కాలేజిలో చదివిన తర్వాత ఫోటోలు మీటింగులు వుంటాయని.'

'తెలుసు తర్వాత మొగుడితో కాపురం చెయ్యాలని తెలీదూ.' పిడికిలి బిగించి పొట్టలో గుద్దాడు—

తన స్నేహితురాలనేది నవ్వుతూ 'భార్యలను కొట్టటమనే పశుత్వ మేనాడో పోయింది. భర్తలను కొట్టే కాలంకూడా దగ్గరలోనే వుంది.' అని.

ఏం మారాడు మగవాడు? అనుక్షణం ద్వేషం, అసూయ, శత్రుత్వం. ఇదేమి జీవితం? ఈ ముళ్ళ పొదల జీవితమేనా దాంపత్యమనే నందనవనం? తనని చూస్తే అతనిలో రాక్షసత్వం విజృంభిస్తుందెందు కని?

మనిషి ఎంతో అల్పుడు. ఉన్న కాస్త జీవితాన్ని ఇలా ద్వేషాలతో ఎందుకు నరకప్రాయం చేసుకుంటాడు? అతనితో ఈ విషయాలన్నీ చర్చించాలనిపించేది. కాని కర్కశమైన మాటలు, తీవ్రమైన చూపులు తన ఒళ్ళు జలదరింపజేసేవి.

ఆయన ఇంట్లోవుంటే తనకు ముళ్ళమీద వున్నట్లుండేది. సాయంకాలం దగ్గరపడుతుంటే, ఆయన అడుగుల చప్పుడు వింటే తన గుండె లయ తప్పేది. ఎప్పుడు కొరడా పట్టుకున్నట్లే క్రూరంగా చిత్రించుకునేది అతన్ని, అతనితో ఏకశయ్యమీద పడుకోవటమంటూ జరిగితే తనకు నిద్రపట్టేది కాదు. ఒకవేళ నిద్రపట్టినా, కలత నిద్రే దానిలో పీడకలలు. ఎన్నోసార్లు నిద్దట్లో కెవ్వున అరచి అతనితో చీవాట్లుతింది.

ఒక అర్ధరాత్రి బాగా తాగివచ్చాడు.

'ఇదీ భరించాలా?' అంది కోపంగా.

"నువ్వెవ్వరు నాకు చెప్పటానికి? నేను సంపాదిస్తాను నాయిష్టం. నోరుమూసుకు ఇటురా!"

ఛీ—ఛీ—పాడూ—

'ఏమిటే నీ వాగుడూ—

ఆ ఉక్కు చేతులు తన బ్రతుక్కే సవాలు.

'ఆడదన్న తర్వాత అణిగిమణిగి వుండాలి. సావిత్రి, సుమతి కథలు చదువుకోలేదూ? వాళ్ళందరూ నీలాగే బరితెగించారా?'

'ఆ కట్టుకథలు నాకు చెప్పకండి. ద్వేషంతో, అధికారంతో ఎవరినీ మీ వారిగా చూసుకోలేరు. అలా ఎవరైనా మీకు అణిగి వున్నా అది పిరికితనమూ, శక్తిహీనతే. లోలోన మిమ్మల్ని తప్పక ద్వేషిస్తారు.'

గాజుగ్లాసు ఎగిరివచ్చి తన నుదిటిని కొట్టుకుంది.

'చెప్పుతోంది పెద్ద ఉపన్యాసం. కాలేజి చదువులు వెలగబెట్టావుగా.'

ఎడమ చేత్తో రక్తం తుడిచేసుకుంటూ బాత్‌రూంకేసి నడిచింది తను.

ప్రతిరోజూ ఒక శాపం— ఇల్లొక నరకం— ఇలా ఎన్నాళ్ళు? ప్రేమాను రాగాలు ఏనాడో మరచిపోయి సహించటం నేర్చుకుంది. అదీ బాగా సన్నగిల్లుతోంది. ఆ పెళ్ళి ఒక సాంఘిక వ్యవస్థే—తల్లిదండ్రుల కోసం, మర్యాద కోసం సహించింది. కానీ ఎన్నాళ్ళు! ఎన్నాళ్ళు! ఒకసారి ధైర్యం చేసి అడిగేసింది.

'ఇద్దరూ ఒకర్నొకరు ద్వేషించుకొంటూ బ్రతకక్కపోతేనేం? మీకు

నచ్చినవాళ్ళనెవరినైనాచేసుకోండి. నాకు విముక్తి కలిగించండి. ఉద్యోగం చేసుకు బ్రతగ్గలను.'

'నీకర్మ, నాకర్మ, అనుభవించక తప్పదు, సంఘంలో నేను తలెత్తుక తిరగొద్దూ! అయినా కాలేజీ ప్రియుడెవరయినా ఉత్తరం వ్రాశాడా?'

అబ్బ! మాటల్లో విషం మిళాయించటమంటే ఇదే కాబోలు.

'ఇదిగో ఈమాట ఎన్నడూ ఎత్తకు. నీవీ విధంగా కృంగి కృంగి చావవలసిందే. నేను సుఖపడను. నిన్ను సుఖపడనివ్వను. అలా నిలువు గుడ్లేసుకు చూస్తావేం? తిండిపడెయ్.'

త్రాగుడు ఎక్కువయిందని డాక్టరు చెప్పనూ చెప్పాడు. అయినా తను మానలేదు. ఆ మత్తులో ఒక రాత్రి లారీ క్రిందపడ్డాడు.

'ఇన్ని దెబ్బలు తగిలినా నేను చావనే, నేను చస్తే నువ్వు సుఖ పడిపోవూ?' చచ్చేముందు రోజు అతినీరసంగా అతనన్న మాటలివి.

చచ్చిపోయాడు. తన జీవితంలో తుఫాను వెలిసింది. ఈ తుఫానులో తన పసుపు కుంకుమలు కోల్పోయింది. నిరంతరం ద్వేషిస్తూ, చిత్రవధ చేసిన వ్యక్తికి, ఒకటయినా మధురానుభూతిని ఇవ్వని వ్యక్తిని కోల్పోయినందుకు తను విలపించాలా? ఇద్దరూ శత్రువుల్లా జీవించారు. కేవలం ఒక సామాజిక వ్యవస్థకు కట్టుబడి ఎలా ఆరాధించ గలదు? కుక్కమొరిగితేనే రాయివిసిరే తత్వం మనిషిది. తేలుకుట్టుందే మోనని, దాన్ని చూడగానే చంపేసేవాడు మనిషి. అటువంటిది రోజూ శారీరకంగా, మానసికంగా బాధించిన వ్యక్తిని ఎవరైనా ఎలా ప్రేమిస్తారు? అందరూ గౌతమ బుద్ధులు, మహర్షులూ కాదు కదా. అయినా—తను తప్పుదారిలో వుందేమో—ఏమో—భారత సతీత్వానికే తను కళంకమేమో! కాని తనను తాను మభ్యపెట్టుకోలేదు. అతను లేడని తాను ఏడువలేదు. అసహజం—అన్యాయం. అవినీతి—అధర్మం. ఊహుఁ గుండెలలోలేని స్పందన మాటల మూలంగా రాదు. తన జీవితాన్ని శాపంగా మార్చిన తన దుర్విధికి ఏడుస్తుంది కాని భర్త మరణానికి కాదు—అవును, భర్త మరణానికి కాదు— అవును, భర్త మరణానికి కాదు—